సాక్షి నిజామాబాద్

బుధవారం । 27 । ఆగస్టు । 2025



జాతీయస్థాయి బేస్‌బాల్..

జిల్లాకు చెందిన క్రీడాకారులు సౌమ్యారాణి, శృతి, అనూష, శరణ్య, సాయికుమార్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ పలుచోట్ల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

స్పాట్ కౌన్సెలింగ్‌కు ఏడు దరఖాస్తులు

- మరో రెండు రోజులు అవకాశం
- ఇంజినీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు మంగళవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్‌కు ఏడుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి తెలిపారు. ఈ నెల 28, 29వ తేదీల్లో కూడా స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ కోర్సుల తరగతులు బోధించేందుకు సుదీర్ఘ అనుభవం కలిగిన రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 29వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు.

రేపు డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల

- సెప్టెంబర్ 2న తుది జాబితా..

సుభాష్‌నగర్: గ్రామపంచాయతీ, వార్డుల వారీగా ఫొటో ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఈనెల 28వ తేదీన విడుదల కానుంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా పంచాయతీ అధికారులను మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 29న గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయిలో, 30న మండల స్థాయిలో సమావేశం నిర్వహించనున్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై 28 నుంచి 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 31వ తేదీన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. సెప్టెంబర్ 2న అన్ని గ్రామపంచాయతీల్లో ఫొటోలతో కూడిన ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు.

జీజీహెచ్ మరమ్మతులకు రూ.2.76 కోట్లు

- మరుగుదొడ్లు, డ్రెయినేజీలు, భవనం పనులు
- పాలియేటివ్ కేర్ సెంటర్ అభివృద్ధి



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2కోట్ల 76లక్షలు మంజూరు చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుగుదొడ్లు, డ్రెయినేజీలు, తలుపులు, కిటికీలు, భవనం ముందు భాగంలో మరమ్మతులు చేపట్టడంతోపాటు పాలియేటివ్ కేర్ సెంటర్ అభివృద్ధి, ల్యాబ్ మరమ్మతులు, టీహబ్ విస్తరణ పనులు చేపడతామని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పదేళ్లుగా మట్టి విగ్రహం తయారీ..




నందిపేట్(ఆర్మూర్): మండలంలోని ఉమ్మెడ గ్రామానికి చెందిన బుచ్చ శ్రీధర్ పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతగా ఏడు అడుగుల మట్టి గణపతిని తయారు చేశాడు. అంతే కాకుండా 100 మట్టి గణపతులను తయారు చేసి గ్రామంలోని ఇంటింటికి పంపిణీ చేసి పర్యావరణ హితం కోసం ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. బజరంగీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల కోసం పదేళ్లుగా శ్రీధర్ మట్టి గణపతిని స్వయంగా తయారు చేసి ఇస్తున్నాడు. గణపతుల తయారీ కోసం రెండు నెలల సమయాన్ని కేటాయిస్తున్నాడు. అలాగే మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాలుగా మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తూ యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు.



పోచమ్మగల్లీలో 55 అడుగుల మట్టి విగ్రహం

విఘ్నాలను తొలగించే గణనాథుడు

ప్రకృతికి విఘ్నం కలిగిస్తాడా? అంటూ ప్రశ్నిస్తూ.. వరాలిచ్చే బొజ్జ గణపయ్యను ప్రమాదకర రసాయన రంగులు, పీవోపీతో చూడలేమంటున్నారు జిల్లాలోని పలు గణేశ్ మండళ్ల నిర్వాహకులు. ప్రకృతిని కాపాడుతూనే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దశాబ్దాలుగా మట్టి గణపతులను ప్రతిష్ఠిస్తున్నారు.



డొంకేశ్వర్‌లో కర్ర గణపతి

డొంకేశ్వర్(ఆర్మూర్): వినాయక చవితి ఉత్సవాలకు డొంకేశ్వర్‌లోని (చెక్క) సత్య గణపతి సిద్ధమైంది. ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వసమాజ్ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. 2018లో గ్రామస్తులు ఒక్కొక్కరు రూ.10 చొప్పున డబ్బులు పోగు చేసి నిర్మల్ జిల్లా సిద్దాపూర్‌లో జ్ఞానేశ్వర్ అనే కళాకారుడితో దీనిని తయారు చేయించారు. విగ్రహం తయారు చేసేందుకు మామిడి, తెల్ల జిల్లేడు, ఎర్ర చందనం, రాగి చెక్కలను ఉపయోగించారు. 2018 సెప్టెంబర్ 13నుంచి మండల కేంద్రంలోని సత్య గంగవ్వ మండపంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. విగ్రహాన్ని నిమజ్జనం చేయకుండా రామాలయంలోని ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. మళ్లీ వినాయక చవితికి ఒకరోజు ముందు తెరిచి శుద్ధి చేస్తారు. చవితినాడు రామాలయం నుంచి ఊరేగింపుగా మండపానికి తెస్తారు. సత్య గణపతిని దర్శించుకుని అక్కడే ముడుపులు కడితే కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. అందుకే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు 'సత్య గణపతి'ని దర్శించుకునేందుకు భారీగా తరలివస్తారు.



కర్ర గణపతి

మట్టి గణపతికే జై

- ఉత్సవం.. పర్యావరణ పరిరక్షణ కలగలిస్తేనే ఆనందం
- జిల్లాలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పలు సంఘాలు
- నేడు కొలువుదీరనున్న గణనాథులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సనాతన సంప్రదాయంలో ప్రతి పండుగకూ అనేక పరమార్థాలు ఉంటాయి. పంచభూతాలు, ప్రకృతి వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటూ జీవనం గడపాలనే అంశాలు ముడిపడి ఉంటాయి. ప్రతి అంశం జీవులన్నింటి మనుగడతో ముడిపడి ఉంటుంది. ఆది దేవుడిగా పూజలందుకునే వినాయకుడిని మట్టితో విగ్రహాలను చేసి పూజించాలనే పురాణాలు చెబుతున్నాయి. పరబ్రహ్మ స్వరూపమైన మృత్తిక (మట్టి) ద్వారానే అన్నిరకాల పోషకాలు లభిస్తున్నాయి. మట్టిలోనే మొక్కలు మొలిచి చెట్లుగా ఎదిగి అన్ని జీవులకు అవసరమైన ఆహారం తయారవుతోంది. అలాగే సర్వజీవులు మట్టిలోనే లయమవుతాయి. తొలిపూజలందుకునే గణపతి విగ్రహాలను మట్టితోనే తయారు చేయాలని లింగపురాణంలో ఉంది.

■ నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే హైందవ ఉత్సవ సమితి సభ్యులు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నుంచి 16 అడుగుల బాలగణపతి మట్టి విగ్రహాన్ని తీసుకొచ్చారు. దీనికి పర్యావరణహిత రంగులనే వాడారు. గతేడాది నుంచి పర్యావరణహితంగా నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

■ పోచమ్మగల్లీలో రవితేజ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా అక్కడిక్కడే బెంగాల్ కళాకారులతో మట్టి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. ఈ ఏడాది 55 అడుగుల విగ్రహాన్ని తయారు చేయించారు. భారీ మట్టి విగ్రహం కావడంతో ప్రతిష్ఠించిన చోటే వాటర్ ట్యాంకర్ల ద్వారా నిమజ్జనం చేస్తున్నారు. ఈ గణేశుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

■ మారుతినగర్‌లోని ఆర్ఆర్ అపార్ట్‌మెంట్‌తో పాటు వర్ని చౌరస్తా, న్యాల్‌కల్ చౌరస్తాల్లో మట్టిగణపతులు కొలువుదీరుతున్నాయి.

■ నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారంలో బాలాజీ గణేశ్ మండలి, మల్కాపూర్‌లో శివపుత్ర గణేష్‌మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులు ప్రతిష్ఠిస్తున్నారు.

■ బాల్కొండ మండల కేంద్రంలో నవయుగ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాన్ని గత కొన్నేళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు.

సంప్రదాయం పాటిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలి



వినాయకచవితి నవరాత్రుల నేపథ్యంలో విషరసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను వాడడం మానేయాలి. దీంతో ప్రకృతిలోని అన్ని జీవరాసులకు సమస్య లేకుండా ఉంటుంది. అదేవిధంగా నవరాత్రుల మండపాల వద్ద సంప్రదాయ దుస్తులు ధరించాలి. ఆధ్యాత్మిక, భక్తి పాటలు పాడాలి. మద్యం సేవించి మండపాల వద్దకు రావొద్దు. పోటీతత్వంతో కాకుండా శాస్త్రోక్తంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి. సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలి.

– ధాత్రిక రమేశ్, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి



వినాయక్‌నగర్‌లో హైందవ ఉత్సవ సమితి వారు ఛత్తీస్‌గఢ్ నుంచి తెచ్చిన మట్టి విగ్రహం

గణపయ్య పూజకు వేళాయే..

- నేటి నుంచి నవరాత్రోత్సవాలు



నిజామాబాద్ రూరల్: విఘ్ననాయకుడి నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధమైంది. బొజ్జ గణపయ్య రాకకోసం మండపాలు, ఇళ్లు ముస్తాబయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇప్పటికే భారీ ప్రతిమలు తరలిరాగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మండపాలకు మంగళవారం ఉదయం నుంచి తరలించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ గణేశ్ మండళ్ల నిర్వాహకులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా మారింది. ఉత్సవాల కోసం నిజామాబాద్ నగరంలోని గణపతి ఆలయాలను ముస్తాబు చేశారు. నగరంలోని రైల్వేకమాన్ వద్ద ఉన్న గణపతి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందూరులో 300 ఏళ్ల చరిత్ర కలిగిన బొడ్డెమ్మ చెరువు వద్ద నున్న వినాయక ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఎకో ఫ్రెండ్లీ యూత్‌లు..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన యూత్ అసోసియేషన్‌లు ఎకో ఫ్రెండ్లీ యూత్‌లుగా గుర్తింపు పొందాయి. చౌట్‌పల్లిలో శరత్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా, హసకొత్తూర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 8 సంవత్సరాలుగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ పూజిస్తున్నారు. బషీరాబాద్‌లో పోచమ్మగల్లీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో 10 ఏళ్లుగా మట్టితో తయారు చేసిన గణపతిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. కమ్మర్‌పల్లిలో ఈ ఏడాది నుంచి మట్టితో తయారు చేసిన గణనాథుడిని ప్రతిష్ఠించాలని ఓం పద్మశాలీ విజయ సంఘం తీర్మానించింది.



కమ్మర్‌పల్లిలో ప్రతిష్ఠించనున్న మట్టి విగ్రహం



జిల్లా కేంద్రంలో పూల విక్రయాలు..

అటవీ పక్షులు పెంచుతున్న ముగ్గురిపై కేసు

- నిజామాబాద్ నగరంలో తనిఖీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాలపల్లి ప్రాంతంలో అటవీ పక్షులను బంధించి పెంచుతున్న దుకాణాలపై అటవీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఓ దుకాణంలో అటవీ చిలుకలు, అటవీ కంజులను గుర్తించిన అధికారులు ఇది అటవీ చట్టానికి విరుద్ధమని స్పష్టం చేశారు. దుకాణ యజమానులైన సయ్యద్ సిరాజుద్దీన్, షాజూర్ రహమాన్ ఖాన్, సయ్యద్ బిన్ ఖాలీద్‌లపై అటవీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. దాడుల్లో నిజామాబాద్ ఎఫ్‌డీవో సుధాకర్, ఎఫ్ఆర్వో సంజయ్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.



మాలపల్లిలోని దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

మహిళ, శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నిజామాబాద్ అర్బన్: మహిళ, శిశు సంక్షేమం కోసం అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్సు హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సమకూర్చాల్సిన వసతులు, సిబ్బంది ఖాళీలు, సొంత భవనాల నిర్మాణాల స్థితిగతులు తదితర అంశాలపై చర్చించి, ఐసీడీఎస్ అధికారులకు సూచనలు చేశారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడేలా చొరవ చూపాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

విద్య, వైద్యారోగ్యం తదితర శాఖలతో సమన్వయంతో మహిళ, శిశు సంక్షేమ కార్యక్రమాలు సంపూర్ణంగా అమలయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1501 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను, 494 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయని, 610 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, మరో 397 కేంద్రాలు అద్దె భారం లేకుండా వివిధ భవనాల్లో కొనసాగుతున్నాయని జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ వివరించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ వంటి వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సెంటర్‌లో ఫేస్ రికగ్నిషన్ అటెన్‌డెన్స్ అమలు చేయాలని అన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, పంచాయతీరాజ్ అధికారి శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాకేశ్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆహార భద్రత

- రుచి చూసిన తర్వాత విద్యార్థులకు వడ్డింపు ఉత్తిమాటే..?
- నామమాత్రంగా మారిన కమిటీలు
- బయటి ప్రాంతాల్లో వంట
- బోగస్ ఏజెన్సీల ఇష్టారాజ్యం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు ఏర్పాటైన ఆహారభద్రత కమిటీలు నామమాత్రంగా మారాయి. గతేడాది నవంబర్ 27వ తేదీన కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కమిటీకి ఇన్‌చార్జిగా ఉండగా, పాఠశాలలో పనిచేస్తున్న మరో ఇద్దరు సిబ్బందిని ఈ కమిటీల్లో ఉంటారు. మండలాలు, డివిజన్ల వారీగా జిల్లా కలెక్టర్ ఇతర శాఖల అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆహార భద్రత కమిటీలు పనిచేస్తాయి. ఈ కమిటీల ముఖ్య ఉద్దేశం కలుషిత ఆహారాన్ని నియంత్రిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందేలా చూడడం. ప్రతిసారి వంట చేయడానికి ముందు స్టోర్ రూమ్, కిచెన్‌ను కమిటీ తనిఖీ చేయాలి. భోజనం సిద్ధం కాగానే కమిటీ సభ్యులు రుచి చూసిన తరువాత పిల్లలకు అందిస్తారు. మండలాలు, డివిజన్‌ల వారీగా నోడల్ ఆఫీసర్లు కలెక్టర్‌కు సమాచారం అందిస్తారు. భోజనానికి సంబంధించిన ఫొటోలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వివరాలను ప్రతిరోజూ రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది.

జరుగుతోంది ఇదీ..

నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం వేరే ప్రాంతంలో వంట చేసి తీసుకువస్తున్నారు. దీంతో భోజనం తయారీ సమయంలో పర్యవేక్షణ కొరవడింది. అర్బన్ ప్రాంతంలోని 12 పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రారంభంలో కమిటీలు హడావుడి చేసినప్పటికీ ప్రస్తుతం నామమాత్రంగా మారాయి. భోజనం వికటించిన తర్వాత అధికారులు పరుగులు తీస్తున్నారు. పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రికార్డుల్లో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో గత కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. విద్యార్థుల సంఖ్య తప్పుగా నమోదు చేయడం, భోజనం నాణ్యత విషయంలో ప్రశ్నించిన హెచ్‌ఎం, సౌత్ మండల విద్యాశాఖాధికారి సాయారెడ్డిని ఏజెన్సీ నిర్వాహకుడు బెదిరించడం గమనార్హం. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో పర్యవేక్షణ లేకుండాపోయింది.



ఖలీల్‌వాడి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం వేరే ప్రాంతంలో వంట చేసి ఈ ఆటోలో తీసుకువచ్చారు. వంట చేసే సమయంలో అసలు పర్యవేక్షణ లేకుండాపోయింది. అసలు ఎక్కడ వంట చేస్తున్నారు? వంట గది ఎలా ఉంది? అనే విషయాలను పట్టించుకునే వారు లేకుండాపోయారు.



ఓ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏజెన్సీల నిర్వాహకులు కాదు.. డిక్టేటర్లు

పలువురు మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు దీనిని పెద్ద బిజినెస్‌గా మార్చారు. వారు చెప్పిందే వేదంలా మారింది. ఫిర్యాదులు, విచారణలు వారిని ఏమీ చేయలేకపోతున్నాయి.

✣ ఓ వ్యక్తి తమ బంధువుల పేరిట నగరంలో మొత్తం 23 ఏజెన్సీలను నిర్వహిస్తున్నాడు. కొనేళ్లుగా వారి చేతుల్లోనే ఏజెన్సీలున్నాయి. గతంలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో రూ.7 కోట్ల 62 లక్షల అవినీతి వెలుగుచూసింది. దీంతో నాటి ప్రజాప్రతినిధులు ప్రగతి భవన్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షలో సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుడిపై చర్యలు తిసుకోవాలని ఆదేశించారు. అయితే ఓ మంత్రి అతడికి సహకరించడంతో సేఫ్ అయ్యాడని అంతా చర్చించుకుంటున్నారు.

✣ ఓ మాజీ కార్పొరేటర్ నగరంలో 345 మంది విద్యార్థులున్న ఓ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. అతడిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. నాటి డీఈవో లింగయ్య రెండు సార్లు ఏజెన్సీని రద్దు చేశారు. అయినప్పటికీ ప్రస్తుతం అతడే కొనసాగుతుండడం గమనార్హం. ఆ పాఠశాలలో భోజనం సరిగా ఉండకపోవడంతో విద్యార్థులు ఇంటినుంచి తెచ్చుకుంటున్నారు. ప్రతి రోజూ 100 మంది విద్యార్థులు భోజనం చేస్తే 345 మంది విద్యార్థుల బిల్లులు పొందుతున్నాడు.

✣ మాజీ డిప్యూటీ మేయర్ ఒకరు నాలుగు పాఠశాలల భోజన ఏజెన్సీలను నడుపుతున్నాడు. ఒకే చోట వంట చేయించి అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నాడు. భోజనం నాణ్యతపై ఓ హెచ్‌ఎం గతంలో ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడ్డాడు.

✣ ఆర్మూర్‌లో ఇద్దరు అధికారి పార్టీకి చెందిన నాయకులు, బోధన్‌లో 9 మంది మాజీ ప్రజాప్రతినిధులు ఏజెన్సీలను నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు/ గురుకులాలు / వసతిగృహాలు

విద్యాలయాలు	సంఖ్య	విద్యార్థులు
ఎంపీపీ, జిల్లా పరిషత్	1039	81771
రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్లు	112	13,376
గురుకులాలు	46	8352
ఆదర్శపాఠశాలలు	09	1,110
కేజీబీవీలు	25	6180
వసతిగృహాలు	83	7,832

పకడ్బందీగా అమలు చేస్తున్నాం

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగానే అమలయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. కమిటీలు సైతం పర్యవేక్షిస్తున్నాయి. కొన్ని చోట్ల ఏజెన్సీల నిర్వాహకులు తప్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. – అశోక్, జిల్లా విద్యాశాఖాధికారి

సంతోషాలు నింపాలి : కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌ అర్బన్‌: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించే ఆది దేవుడైన వినాయక చతుర్థి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగ ప్రతి ఇంటా సుఖ సంతోషాలు నింపాలని, గణనాథుడి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆభిలషించారు. పర్యావరణానికి హాని కలుగని విధంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజించాలని సూచించారు.

మండప నిర్వాహకులు.. పాటించాలి జాగ్రత్తలు

- సీపీ పోతరాజు సాయిచైతన్య
- వినాయక నవరాత్రుల సందర్భంగా కీలక సూచనలు


సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: వినాయక నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ వేడుకలను తొమ్మిది, పదకొండు రోజులపాటు నిర్వహిస్తారు. ఉత్సవాల కోసం ఊరూరా, వాడవాడలా మండపాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులకు సీపీ పోతరాజు సాయి చైతన్య పలు కీలక సూచనలు చేశారు.

- ఆన్‌లైన్‌ పోర్టల్‌ https://policeportal.tspolice.gov.inలో వివరాలను నమోదు చేయాలి.
- దరఖాస్తు అనంతరం జనరేట్‌ అయిన క్యూఆర్‌ కోడ్‌ను వినాయక మండపం వద్ద పోలీసులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి.
- కరెంట్‌ స్తంభాలు, తీగలకు దూరంగా మండపం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్‌ కనెక్షన్‌ కోసం ట్రాన్స్‌కో అనుమతి తీసుకోవాలి.
- విద్యుత్‌ తీగలపై వర్షపు నీరు పడకుండా చూడాలి. ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.
- అగ్ని ప్రమాదాల నివారణకు మండపం వద్ద నీటితో నింపిన బకెట్, ఇసుక బస్తాలను ఉంచాలి.
- అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్‌ అధికారులకు సమాచారం అందించి, మంటలు వ్యాపించకుండా ఆర్పేందుకు ప్రయత్నించాలి.
- మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎల్లప్పుడూ ఇద్దరు వ్యక్తులు మండపం వద్ద ఉండాలి.
- మండపం చుట్టుపక్కల ఉండేవారికి ఇబ్బంది కలిగించకుండా పెద్ద సౌండ్‌తో పాటలు పెట్టొద్దు.
- సోషల్‌ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దు. అసత్య ప్రచారం చేయొద్దు.
- నిమజ్జన ఊరేగింపు బాధ్యతను నిర్వాహకుల్లో ఇద్దరికి అప్పగించాలి.
- వినాయక రథానికి ఇరువైపులా తాళ్లు పట్టుకోవడానికి కనీసం నలుగురు వ్యక్తులను ఏర్పాటు చేయాలి.
- జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో టపాసులు వెలిగించొద్దు.
- చెరువులు, వాగుల వద్ద నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.
- అవాంఛనీయ ఘటన జరిగితే డయల్‌ 100 కాల్‌ చేయాలి.


గణేశ్‌ విగ్రహాన్ని తీసుకెళ్తున్న నగరవాసులు


గణేశ్‌ విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న యువకులు

పది కౌంటర్లు..700 గణేశ్‌ మండపాలకు చందాలు

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: బాల గంగాధర్‌ తిలక్, శివాజీ మహరాజ్‌ స్ఫూర్తిగా హిందువుల్లో ఐకమత్యం పెంపొందించడమే లక్ష్యంగా ట్రస్ట్‌ ద్వారా నగర గణేశ్‌ మండపాలకు తనవంతు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. ధన్‌పాల్‌ లక్ష్మీబాయి, విఠల్‌ గుప్త చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ధన్‌పాల్‌ ఆర్థిక సహకార కార్యక్రమం మంగళవారం రెండోరోజూ కొనసాగింది. పది కౌంటర్లు ఏర్పాటు చేసి, సుమారు 700లకుపైగా గణేశ్‌ మండపాలకు చందాలు అందజేశారు. హిందూ ధర్మరక్షణ, మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కోసం హిందువుల్లో ఐక్యత పెంపొందించే ప్రతి కార్యక్రమానికి తన సహాయసహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మండపాల నిర్వాహకులకు చందాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్సలు


చికిత్స పొందుతున్న పాప

నిజామాబాద్‌నాగారం: ఏడాది వయస్సు ఉన్న పాపకు జీజీహెచ్‌లో అరుదైన చికిత్స చేశారు. ఈ నెల 15న ఉదయం 3 గంటల సమయంలో పాముకాటుకు గురైన సారంగాపూర్‌కు చెందిన భానుశ్రీ అనే పాపను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పాముకాటు(క్రైట్‌-న్యూరోటాక్సిక్‌)తో ఇబ్బందులు పడింది. అదే రోజు ఉదయం 5.30గంటలకు పాపను ఐసీయూలో చేర్చినప్పుడు గ్యాస్పింగ్, చలిగా ఉండడం కనిపించిందని వైద్యులు తెలిపారు. పేషెంట్‌ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రెస్పిరేటరీ పెరాలసిస్‌కు గురైందని వైద్యులు తెలిపారు. 9 రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. పిల్లల వైద్య నిపుణులు, హెచ్‌వోడీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ శ్రీనివాస్, ప్రొఫెసర్లు డాక్టర్‌ ఎండీ అబ్దుల్‌ సలీమ్, డాక్టర్‌ శ్రీకాంత్, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ శరత్‌చంద్ర, డాక్టర్‌ కీర్తి, సీనియర్‌ రెసిడెంట్‌ డాక్టర్‌ ఎండీ జైనులాబుద్దీన్, పీజీ వైద్యులు డాక్టర్‌ హరీశ్‌కుమార్, డాక్టర్‌ సందీప్‌ల బృంద పర్యవేక్షణలో చికిత్స అందించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై నుంచి పాపను బయటకు తీయగా, ఆరోగ్యం నిలకడగా ఉంది. పాప ఆరోగ్యం మెరుగవ్వడంతో తల్లిదండ్రులు కళ్యాణ్, లక్ష్మి డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

8 నెలల గర్భిణికి..

ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి వైద్యులు ఓ గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. నగరానికి చెందిన 8 నెలల గర్భిణి గడ్డెల జ్యోతి(36) నొప్పులతో ఈ నెల 19న జీజీహెచ్‌లో చేరారు. ఆమెకు సంక్లిష్టమైన గర్భధారణ సమస్య ఉందని వైద్యులు గుర్తించి తక్షణమే సిజేరియన్‌ ఆపరేషన్‌ చేసి అనంతరం హిస్టరెక్టమీ(గర్భాశయం తొలగింపు శస్త్రచికిత్స) నిర్వహించారు. అలాగే మూత్రశయం కూడా ప్రభావితమవడంతో దానిపై కూడా శస్త్ర చికిత్స చేశారు. అనంతరం కొన్ని రోజులు వెంటిలేటర్‌ సపోర్టు అందించారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణ, నిపుణుల వైద్యంతో ప్రస్తుతం జ్యోతి అపాయం నుంచి బయటపడి కోలుకుంటున్నారు. శస్త్రచికిత్స చేసిన వారిలో గైనిక్‌ హెచ్‌వోడీ డాక్టర్‌ లక్ష్మీప్రసన్న, జనరల్‌ సర్జరీ, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ బాలకృష్ణ, అనస్థీషియా అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అనిల్, యురాలజిస్టు డాక్టర్‌ శబరీనాథ్‌ ఉన్నారు.

విద్యుత్‌ ప్రమాదాలతో జరభద్రం

- ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ ఆర్‌ రవీందర్‌

సుభాష్‌నగర్‌: జిల్లాలో గణేశ్‌ మండపాల నిర్వాహకులు విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ ఆర్‌ రవీందర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్‌పీడీసీఎల్‌ సిబ్బంది సైతం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మండపాల ఏర్పాటు చేయొద్దని తెలిపారు. నాణ్యమైన ఎర్త్‌ లీకేజ్‌ సర్క్యూట్‌ బ్రేకర్, అవసరమైన ఎంసీలను అమర్చుకోవాలని, వైరింగ్‌ను లైసెన్స్‌డ్‌ ఎలక్ట్రీషియన్‌తో చేయించుకోవాలని సూచించారు. సర్వీస్‌ వైర్‌ను స్తంభానికి బిగించిన తర్వాత లైన్‌మన్, జేఎల్‌ఎంలకు చెప్పకుండా మార్చకూడదని తెలిపారు. పిల్లల భద్రత కోసం సరైన ఎత్తులో స్విచ్‌ బోర్డులను అమర్చాలని, మండపాల ప్రవేశద్వారం వద్ద అవసరమైన సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్‌ 1912, ఏఈ, ఏరియా లైన్‌మన్, జేఎల్‌ఎం నంబర్లను ఉంచాలన్నారు. మండపాలకు విద్యుత్‌ సరఫరా ఇచ్చే ముందు వైరింగ్‌ను సంబంధిత ఏరియా ఓఅండ్‌ఎం సిబ్బంది తనిఖీ చేయాలని ఆదేశించారు. విగ్రహాల ఎత్తును రికార్డు చేసుకొని, ఊరేగింపు సమయంలో వైర్లు తగలకుండా చూడాలన్నారు. భద్రతా జాగ్రత్తలపై గణేశ్‌ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల వద్ద, నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్‌ ప్రమాదాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఎస్‌ఈ రవీందర్‌ సూచించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

డిచ్‌పల్లి: ఆదిలాబాద్‌ జిల్లాలో జరిగిన 5వ సీనియర్‌ మహిళలు, పురుషుల బేస్‌బాల్‌ పోటీల్లో నిజామాబాద్‌ జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన క్రీడాకారిణులు సౌమ్యారాణి (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ డిగ్రీ కాలేజీ, ఆర్మూర్‌), శృతి (జీజీ డిగ్రీ కాలేజీ, నిజామాబాద్‌), అనూష, శరణ్య (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, సుద్దపల్లి), పురుషుల విభాగంలో సాయికుమార్‌ (జీజీ డిగ్రీ కాలేజీ) జాతీయ స్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28 నుంచి 31వరకు మహారాష్ట్ర అమరావతిలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి శ్వేత, జిల్లా అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్‌ తెలిపారు. క్రీడాకారులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌ రెడ్డి, గంగామోహన్, సాఫ్ట్‌బాల్‌ అకాడమీ కోచ్‌ నరేశ్, మౌనిక, పీఈటీలు జ్యోత్స్న, నర్మత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

మా వాళ్లను విడిపించి..స్వదేశానికి రప్పించండి

- ప్రవాసీ ప్రజావాణిలో గల్ఫ్‌ బాధిత కుటుంబాల వినతి
- బహ్రెయిన్‌లో జిల్లావాసులకు రెండేళ్ల జైలు


ప్రవాసీ ప్రజావాణి నోడల్‌ అధికారి దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం అందిస్తున్న గల్ఫ్‌ బాధిత కుటుంబ సభ్యులు

డిచ్‌పల్లి/ఇందల్వాయి: కంపెనీ చేయించిన తప్పుడు పనులతో బహ్రెయిన్‌లో జైలు శిక్ష పడిన తమ వాళ్లను విడిపించి, స్వదేశానికి రప్పించాలని నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గానికి చెందిన బాధిత కుటుంబీకులు మంగళవారం ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన తిమ్మజాడ సంతోష్‌(24), డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నకిడి లింబాద్రి(24), రూరల్‌ మండలం మల్లారం గ్రామానికి చెందిన కర్రోళ్ల లక్ష్మీనర్సింహులు గత మే నెలలో ఉపాధి కోసం బహ్రెయిన్‌ వెళ్లారు. పనిచేసే కంపెనీ 19 మందితో కాలం చెల్లిన ఆహార ఉత్పత్తుల లేబుల్లు, తేదీలని మార్పించి అమ్మకం, నిల్వ, మార్కెటింగ్‌ వంటి కార్యకలాపాలు నిర్వహించింది. దీంతో అక్కడి ప్రభుత్వం కంపెనీకి లక్ష దినార్లు(రూ.2.3కోట్లు) జరిమానాతోపాటు పనిచేస్తున్న 19 మంది కార్మికులకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. వీరిలో జిల్లాకు చెందిన ముగ్గురూ ఉన్నారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్‌ డా.బీఎమ్‌ వినోద్‌ కుమార్, వైస్‌ చైర్మన్‌ మంద భీంరెడ్డిల సహకారంతో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసి ప్రజావాణిని ఆశ్రయించారు. నోడల్‌ అధికారి దివ్య దేవరాజన్‌కి తమ వారిని విడిపించి స్వదేశానికి రప్పించాలని వినతి పత్రం ఇచ్చారు. ప్రత్యేక కేసుగా పరిగణించి వారికి క్షమాభిక్ష లభించేలా చూడాలని కోరారు. స్పందించిన ఆమె సీఎం ప్రిన్సిపల్‌ సెక్రెటరీ వీ.శేషాద్రి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సరైన న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. బహ్రెయిన్‌లో సామాజిక సేవకుడు కోటగిరి నవీన్‌ ఇండియన్‌ ఎంబసీ ద్వారా బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చినట్లు మంద భీంరెడ్డి తెలిపారు.

మట్టి గణపతుల పంపిణీ



నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ అసోసియేషన్, హెల్పింగ్‌ హర్ట్స్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గణపతులను అందజేశారు. మట్టి గణపతుల వినియోగం పెంచాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్, రెవెన్యూ అసోసియేషన్‌ నాయకులు రమణ్‌ రెడ్డి, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

మెజీషియన్‌ రంగనాథ్‌కు జాతీయ అవార్డు



నిజామాబాద్‌ రూరల్‌: ప్రముఖ మెజీషియన్‌ రంగనాథ్‌ డాక్టర్‌ బీవీ పట్టాభిరామ్‌ మొదటి స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు తెలంగాణ సైకలాజికల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఎం ఏ కరీం తెలిపారు. ఇంద్రజాల రంగంతోపాటు మనోవికాస రంగంలో విశిష్టత సాధించి జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన రంగనాథ్‌కు 'మైండ్‌ పవర్‌ మెజీషియన్‌'గా గుర్తించి అవార్డును సెప్టెంబర్‌ 10న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా సైనికుల కోసం లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌

నిజామాబాద్‌ లీగల్‌: నగరంలోని సైనిక వెల్ఫేర్‌ కార్యాలయంలో మంగళవారం లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ లీగల్‌ క్లినిక్‌ ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సైనికులు, వారి కుటుంబాలకు న్యాయ సహాయం అందించనున్నారు. సెంటర్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి డి ఉదయ భాస్కరరావు కోరారు. లీగల్‌ ఎయిడ్‌ క్లినిక్‌ ప్యానెల్‌ న్యాయవాదిగా బాలరాజు నాయక్‌ను నియమించారు. ఆన్‌లైన్‌ ద్వారా నిర్వహించిన ప్రారంభోత్సవంలో రెండో అదనపు, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టి శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి డి ఉదయ భాస్కర్‌ రావు, జిల్లా ఇన్‌చార్జి సైనిక సంక్షేమ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.


లీగల్‌ ఎయిడ్‌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జడ్జిలు ఉదయ భాస్కర్‌ రావు, శ్రీనివాసరావు

తెయూ ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరాల సుధాకర్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్‌ డిగ్రీ , పీజీ కళాశాలల యాజమాన్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పద్మిక ప్యాలెస్‌లో మంగళవారం తెయూ పరిధిలోని అన్ని ప్రైవేట్‌ కళాశాలల మేనేజిమెంట్స్‌ సభ్యులు, కరస్పాండెంట్లు పాల్గొని కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆర్కే గ్రూప్‌ ఆఫ్‌ కాలేజీస్‌ కరస్పాండెంట్, సీఈవో డాక్టర్‌ ఎం.జైపాల్‌రెడ్డి (కామారెడ్డి), ప్రధాన కార్యదర్శిగా కేర్‌ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌ నరాల సుధాకర్‌ (నిజామాబాద్‌), కోశాధికారిగా మీమ్స్‌ డిగ్రీ కాలేజ్‌ యజమాని శ్రీనివాస్‌ రాజు (బోధన్‌), ఉపాధ్యక్షులుగా ఎస్పీఆర్‌ డిగ్రీ కాలేజీ యజమాని అరుణ్‌ కుమార్‌ రెడ్డి (డిచ్‌పల్లి), శశాంక్‌ డిగ్రీ కాలేజీ యజమాని సయ్యద్‌ హకీం (బాన్సువాడ), సంయుక్త కార్యదర్శులుగా సిద్ధార్థ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్‌ నవీన్‌ (ఆర్మూర్‌), రాజేశ్వరరావు (కామారెడ్డి), అసోసియేట్‌ అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డి (ఆర్మూర్‌), స్టేట్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా గురువేందర్‌రెడ్డి (కామారెడ్డి), హరిప్రసాద్‌ (నిజామాబాద్‌), లీగల్‌ అడ్వయిజర్‌గా ప్రముఖ న్యాయవాది, మాజీ పీపీ రాజేందర్‌రెడ్డిను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవరెడ్డిలకు వీడ్కోలు సన్మానం చేశారు. అనంతరం కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, సుధాకర్‌ మాట్లాడుతూ ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులుగా హరిస్మరణ్, శంకర్‌ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రైవేట్‌ కళాశాల యాజమాన్యాలు మారయ్య గౌడ్‌ , శంకర్, సూర్య ప్రకాశ్, సృజన్‌ రెడ్డి, బాలాజీ రావు, ప్రతాప్‌ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.


జైపాల్‌రెడ్డి, నరాల సుధాకర్, శ్రీనివాసరాజులను సన్మానిస్తున్న సభ్యులు

క్రైం కార్నర్‌

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



భిక్కనూరు: అప్పుల బాధతో మండల కేంద్రానికి చెందిన యువకుడు మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరుకు చెందిన బండి రాజు (35) మైక్రో ఫైనాన్స్, హౌసింగ్‌ ఫైనాన్స్‌లో అప్పులు తీసుకున్నాడు. చెల్లించడంలో ఆలస్యం కావడంతో ఏజెంట్లు ఇబ్బందులకు గురిచేశారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురై మంగళవారం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, తల్లి రాధ, కుమారుడు మనోజు, కుమార్తె రిషిక ఉన్నారు.

ప్రేమించిన యువతి మోసం చేసిందని..!

- రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యాయత్నం
- కాపాడిన స్థానికులు

కామారెడ్డి క్రైం: ప్రేమించిన యువతి మోసం చేసిందని ఓ యువకుడు రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని పట్టాలపై నుంచి పక్కకు లాగి కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్‌ కాలనీకి చెందిన సచిన్‌ అనే యువకుడు కొంతకాలంగా బెంగళూరులో ఉంటూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నాడు. సెలవుపై రెండు రోజుల క్రితం కామారెడ్డికి వచ్చాడు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో నిజామాబాద్‌ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న గూడ్స్‌ రైలు రాకను గమనించి రైల్వేగేట్‌కు కొద్దిదూరంలో పట్టాలపై తల పెట్టి పడుకున్నాడు. యువకుడు ఆత్మహత్య చేసుకోబోతున్నది గమనించిన స్థానికులు వెంటనే అతడిని పక్కకు లాగి ఆరా తీశారు. అదే కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమించాడనీ, ఆమె మోసం చేయడంతో మనస్తాపం చెందినట్లు సదరు యువకుడి బంధువులు చెబుతున్నారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రూ.1,31,679ల సైబర్‌ మోసం

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రానికి చెందిన సంగెప్ప వీరేశం అనే వ్యక్తి సైబర్‌ మోసానికి గురై రూ.1,31,679లు పోగొట్టుకున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు. బాధితుడికి సైబర్‌ మోసగాడు ఫోన్‌ చేసి ధని ఫైనాన్స్‌లో రూ.1లక్ష లాటరీ తగిలిందని తెలిపాడు. లాటరీ డబ్బులు ఇచ్చేందుకు జీఎస్టీ, ప్రాసెసింగ్‌ ఫీజు పేరిట విడతల వారీగా డబ్బులు వేయించుకున్నాడు. మోసపోతున్నానని గ్రహించిన సంగెప్ప 1930 నెంబర్‌కు కాల్‌ చేయగా సైబర్‌ మోసగాడి అకౌంట్‌లో ఉన్న రూ.3,407లు ఫ్రీజ్‌ చేశారు. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీపీ ఎదుట పలువురి బైండోవర్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్, ఆర్మూర్‌ డివిజన్‌లోని కమ్యూనల్‌ కేసులు, పాత నేరస్తులు, డీజే నిర్వాహకులు 28 మందిని జిల్లా అదనపు మేజిస్ట్రేట్, సీపీ సాయిచైతన్య ఎదుట మంగళవారం బైండోవర్‌ చేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ. సొంత పూచీకత్తు విధించారు. మళ్లీ గొడవలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. కమిషనర్‌ అధికారాల ద్వారా ఒక్కొక్కరిని 6 నెలల పాటు బైండోవర్‌ చేసినట్లు తెలిసింది.